క్లుప్తంగా

మేహాద్రిగెడ్డ ప్రాంతంలో ప్రత్యేక నిఘా



మేహాద్రిగెడ్డ వద్ద యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి : మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఆకతాయిల ఆట కట్టించేందుకు పెందుర్తి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. మేహాద్రి ప్రాంతంలో బహిరంగ మద్యపానం, గంజాయి వినియోగం, మేహాద్రిలో ప్రమాదాలపై ఇటీవల ఫిర్యాదులు రావడంతో సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్ఐ అసిరితాత మేహాద్రి ప్రాంతంలో పర్యటించి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించి మద్యపానం, గంజాయి వినియోగం, నిషేధిత ప్రాంతాల్లో ఈతకు దిగడం వంటి కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు సదుపాయాల కల్పనకు కృషి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ నాయుడు తదితరులు

పరవాడ : ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు అన్నారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదవాలన్నారు. పుస్తకాలు, బ్యాగులు, మధ్యాహ్న భోజన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సారిపల్లి జోగినాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ గొలగాని బాబూరావు, హరిబాబు, కాశీ, ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు, ఎం.అనకేశ్వరి, దేవి, శ్రీవాణి, శిరీష పాల్గొన్నారు.

మజ్జిగ, ప్రసాదం పంపిణీ



భక్తులకు మజ్జిగ అందజేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం : అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను పురస్కరించుకుని మంగళవారం కొత్తవీధిలోని అమ్మవారి ఆలయం వద్ద గణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, ప్రసాదం పంపిణీ జరిగింది. గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు పలువురు భక్తులకు ప్రసాదం, మజ్జిగ అందజేశారు. సంఘం ప్రతినిధి మధు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం



ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే పంచకర్లను సత్కరిస్తున్న నాయకులు

పెందుర్తి : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. పెందుర్తిలోని తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో మంగళవారం కూటమి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమపై ఎంతో విశ్వాసంతో ఓట్లు వేసి గెలిపించారని.. వారికి కావలసిన పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేలను టీడీపీ, జనసేన నాయకులు సత్కరించారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంజలి రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం



పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పైడితల్లమ్మా.. చల్లగ చూడమ్మా

- ఘనంగా అమ్మవారి పండగ
- పోటెత్తిన భక్తజనం
- విశేషంగా అనుపు మహోత్సవం

అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ కనుల పండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



ఘటాలను తీసుకొస్తున్న పూజారి వంశీయులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఏడు గ్రామాల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామస్తులు, మహిళలు కొత్తవీధిలోని అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పసుపు కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పళ్లు, వడ పప్పు, చలిమిడి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి సింహాచలం దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. అలాగే గాంధీనగర్‌లో ఉన్న శతకంపట్టు వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఘటాల గుడి వద్ద కూడా భక్తులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం అధికారులు ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద క్యూలు, టెంట్లు, షామియానాలు, మంచినీరు ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం సెక్యూరిటీ గార్డులను, పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేశారు. అలాగే అడవివరం పురవీధుల్లో పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పండగని పురస్కరించుకుని గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా అనుపు మహోత్సవం..

పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా మంగళవారం రాత్రి అనుపు మహోత్సవాన్ని గ్రామ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని సతకం పట్టు నుంచి అమ్మవారి ఘటాలు, గరగలను పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు, గ్రామస్తులు, మహిళలు శిరస్సుపై పెట్టుకుని కొత్తవీధిలో ఉన్న ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు దారి పొడవునా మహిళలు, భక్తులు హారతులిచ్చారు. ఘటాలను శిరస్సుపై ఉంచుకుని పలువురు గ్రామస్తులు మొక్కు తీర్చుకున్నారు. అంతకు ముందు ఉదయం గాంధీనగర్‌లోని అమ్మవారి సతకం పట్టు వద్ద అంజలి రథోత్సవ సేవ నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులతో సతకంపట్టు ఏరియా అంతా కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు నూతన ఘటాలను శిరస్సుపై పెట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కుబడిగా సమర్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పూజారి వంశీయుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది.



పైడితల్లి అమ్మవారు



పైడితల్లికి నూతన వస్త్రాలు తీసుకొస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

అనుపు మహోత్సవంలో సింహాచలం దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పులివేషాలు, కాంతారా డ్యాన్స్, కేరళ డ్రమ్స్‌తో కళాకారులు ఆకట్టుకున్నారు. అలాగే పలు విచిత్ర వేషధారణల్లో గ్రామస్తులు అలరించారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి

సింహాచలం : జ్యేష్ఠ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. లక్ష్మీనారాయణస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠింపజేసి విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ధ్వజారోహణం, ఎదురుసన్నాహోత్సవాలను విశేషంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

ఆంగ్ల అధ్యాపకునికి డాక్టరేట్

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్, ఆంగ్ల ఆధ్యాపకునిగా పని చేస్తున్న బి. శంకర్‌కు ఆంగ్ల భాషలో శ్రవణ, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి ఆయనను అధ్యాపకులతో కలిసి మంగళవారం అభినందించారు. రాజస్థాన్‌లోని ఆల్వార్ సమీపంలో ఉన్న సన్‌రైజ్ యూనివర్సిటీ ఆంగ్ల భాషలో ఆచార్య రష్మీ సక్సేనా పర్యవేక్షణలో ఆంగ్ల భాషలో శ్రవణ, భావవ్యక్తీకరణ నైపుణ్యాలపై నిర్వహించిన పరిశోధనలో డాక్టరేట్ లభించిన వారికి ఈ నెల 14న డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డాక్టర్ బి. శంకర్ తెలిపారు.

ఉద్యోగ భద్రతకు వినతి



గండి బాబ్జీకి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

సబ్బవరం: ప్రభుత్వ మద్యం దుకాణాలలో పని చేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోయేషన్ ఉద్యోగులు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లు మంగళవారం గండి బాబ్జీని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 3,600 మద్యం దుకాణాలలో సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా పని చేసేందుకు అప్పటి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో తమను నియమించిందన్నారు. 5 సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల మంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. సోషల్ మీడియాతో పాటు వివిధ పత్రికల్లో మద్యం షాపులు ఎత్తేసి పాత పద్ధతిని పునరుద్ధరించనున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. అదే నిజమైతే తామంతా రోడ్డున పడతామన్నారు. కనుక మద్యంపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తమకు వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి. దుర్గారావు, జి. వెంకట్, పి. శ్రీను, కె. కార్తీక్, జి. వంశీ, ఎ. చంద్రశేఖర్, జి. స్వామి, కె. హరి, వి. కుమార్, జి.వి.వి. ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి విశేష అభిషేకాలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జాము 5 గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా శ్రీ మోదకొండమ్మ అమ్మవారి పండగ



విశేష అలంకరణలో శ్రీ మోదకొండమ్మ అమ్మవారు



అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటున్న భక్తులు

అల్లిపురం : చలువతోటలో వెలసిన శ్రీ మోదకొండమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన నారాయణసేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం

యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టిన అధికారులు



సింటెక్స్ వాటర్ ట్యాంక్‌లో ఎప్పటి నుంచో ఉన్న నీటిని పరిశీలిస్తున్న మలేరియా అధికారి



నర్సింగ్ స్కూల్లో డెంగ్యూ నివారణకు మినీ ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



నర్సింగ్ కళాశాల, స్కూల్ చుట్టూ యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

దాబాగార్డెన్స్: ఎంతో మందికి ఆరోగ్య సేవలందిస్తున్న కేజీహెచ్‌లో డెంగ్యూ కలకలం రేపుతోంది. అపరిశుభ్ర వాతావరణంతో కేజీహెచ్ కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా కేజీహెచ్‌కు అనుసంధానంగా ఉన్న నర్సింగ్ కళాశాల, నర్సింగ్ స్కూల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. డ్రైనేజీలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. డెంగ్యూ జ్వరంతో కేజీహెచ్‌లో చికిత్స పొందే ఎందరో రోగులకు వైద్య సేవలందిస్తున్న నర్సింగ్ విద్యార్థినికి డెంగ్యూ సోకింది. కింగ్ జార్జి ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న నర్సింగ్ స్కూల్ విద్యార్థికి డెంగ్యూ సోకింది. సమాచారం అందిన జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబశివరావు, జోన్–4 మలేరియా ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సిబ్బంది, అప్రమత్తమయ్యారు. వ్యాధి మకరొకరికి సోకకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలు, మూతలు లేని సింటెక్స్ మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. కేజీహెచ్‌లో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రింగ్, మినీ ఫాగింగ్ చేపట్టారు.

ఫార్మాసిటీ కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

పరవాడ: ఫార్మాసిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన కరవు వీడీఏ పాయింట్లను అమలు చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు విడుదల చేసే వీడీఏ కరవు భత్యం అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఆరు నెలలకొక పర్యాయం రూ.10, రూ.20 పెంచి చేతులు దులుపుకుంటున్నారన్నారు. గత 12 ఏళ్లుగా జీవోను సవరించకపోవడం విచారకరమన్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యంగా పేర్కొన్నారు. యాజమాన్యాలకు అండగా ప్రభుత్వాలు నిలుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఫార్మాసిటీలో జీవో సవరించి కనీస వేతనాలు పెంచాలన్నారు. వీడీఏ పాయింట్లను అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు డి.దేముడు, కె.ఎంకునాయుడు, కె. దొరబాబు పాల్గొన్నారు.

రేపు శ్రీ దుర్గమాంబ అమ్మవారి అనుపు



పరవాడ: స్థానిక ప్రజల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ దుర్గమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పైల పోతునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి పండగ మహోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గురువారం వేకువ జాము నుండి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్ఎంపీలకు అవగాహన

తాటిచెట్లపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్న ఆర్ఎంపీలకు మంగళవారం రైల్వేన్యూకాలనీలోని అక్షయ హాస్పటల్‌లో అవగాహన నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అక్షయ హాస్పటల్ ఎండీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పటల్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాణ్యమైన వైద్యం పేదలకు అందించడమే తమ ధ్యేయమన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ కేకే శిరీష, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భావన, ఆర్థోపెడీషియన్ డాక్టర్ వర్మ వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు.

ఉక్కు కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని ఉక్కు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఉత్పత్తి, సేల్స్ జరుగుతున్నా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కొన్ని నెలలుగా జీతాల కోసం ఆందోళన చేసేలా యాజమాన్యం ప్రవర్తిస్తోందన్నారు. 18వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. దీనిపై యాజమాన్యాన్ని నిలదీయాల్సి ఉందన్నారు.

ముందుగా సగం వేతనాలు

ఉక్కు యాజమాన్యంతో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో మంగళవారం సాయంత్రం సగం వేతనాలు ఇస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మిగిలిన సగం బుధవారం సాయంత్రం వేస్తామన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి అంటూ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ పిలుపు నిచ్చింది. ఈమేరకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని అది ఎంతమాత్రం క్షేమకరం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా జూన్18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతి ఘటనా దినంగా ప్రకటించిందని గుర్తు చేశారు. పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చెయ్యాలనే సంకల్పంతో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునీర్, సత్యమూర్తి పాల్గొన్నారు.